# హైద్రాబాదు కుట్రకేసు

**విశ్వం**

*కా॥మ్రేడ్ తరిమెల నాగిరెడ్డి శతజయంతి(2017 సం॥) సందర్భంగా ఆయన జీవితాన్ని, రాజకీయాలను ప్రజలముందు వివరంగా ఆవిష్కరించే ప్రయత్నంలో భాగంగా టి.ఎన్.మెమోరియల్ ట్రస్టు ప్రచురించిన అనేక పుస్తకాలలో ఒకటైన, కా॥విశ్వం వ్రాసిన 'కమ్యూనిస్టు విప్లవకారుడు, దేశభక్తుడు-పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు తరిమెల నాగిరెడ్డి జీవితము-రాజకీయాలు' అన్న పుస్తకం నుండి 'హైదరాబాదు కుట్రకేసు' అనే అధ్యాయాన్ని అందిస్తున్నాం.* **- సంపాదకుడు**

**ప్రజాస్వామ్యబద్ధంగా** ఎన్నికైన భారత ప్రభుత్వాన్ని కుట్రపూరితంగా కూల ద్రోయాలని ఈ కుట్రదారులు ప్రయత్నించారని భారత క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 120(బి), 121(ఎ), 121, 122, 123, 124 సెక్షన్స్ క్రింద కేసులు బనాయించి నాగిరెడ్డి, దేవులపల్లి, మండ్ల సుబ్బారెడ్డి, సుంకర లక్ష్మీనరసయ్య, చల్లపల్లి శ్రీనివాసరావు, మానం రామారావు, సింహాద్రి సుబ్బారెడ్డి, శాంతిరాజు, మాదాల నారాయణస్వామి, మొగులూరి సోమాచారి, మండే పిచ్చయ్య, దుప్పల కృష్ణమూర్తి, జొన్నా కోటయ్య, ఎన్.వి.కృష్ణయ్య నెక్కలపూడి రామారావు, అన్నె వెంకటేశ్వరరావు, వసంతాడ రామలింగాచారి, సి.హెచ్.అప్పన్న మొదలగు విప్లవకారులను అరెస్టు చేశారు. ఈ ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికయిందన డాన్ని, భారతదేశానికి సర్వసత్తాక రాజ్యాంగం, న్యాయచట్టాలు ఉన్నాయని ప్రభుత్వం ఉదహరించడాన్ని విప్లవకారులు సవాల్‌చేశారు.

భారత పౌరుల అవసరాలు తీర్చే ఏ సెక్షన్స్ కూడా ఈ న్యాయచట్టాలలో లేవని, 1860 నాటి బ్రిటీష్ వలస పాలకులు ఆనాడు తమ వలస పాలనను వ్యతిరేకించే దేశభక్తులను అణచివేయ డానికి, తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగించడానికి వీలుగా తయారుచేసుకొన్న అత్యంత క్రూరమైన నిబంధనల సారమే ఈ న్యాయ చట్టం అని వాళ్ళు పేర్కొన్నారు. అదే న్యాయ చట్టాన్ని ఈనాటికీ ఈ 'స్వతంత్ర' భారత ప్రజాస్వామిక నేతలు కొనసాగించడం అంటేనే ఈ దివాళాకోరు, దళారీ పాలకులకు ఈదేశ సామాన్య పీడిత ప్రజానీకాన్ని ఊచకోతలు కోయడానికి, వాళ్ళ ప్రజాస్వామిక ఆకాంక్షలను నేలరాయడానికే తప్ప ఈ దేశంలో పూర్తి స్వతంత్ర, ప్రజాస్వామ్యయుత పాలనను స్థాపించడానికి కాదని స్పష్టంగా అర్థం అవుతుందని విప్లవకారులు ఎలుగెత్తి చాటారు.

కుట్ర అనే పదానికి అర్థాన్ని వివరిస్తూ ఏ కొద్దిమందో రహస్యంగా ఒక పథకం ప్రకారం ఆలోచించి అమలుచేసే ఒకానొక కార్యక్రమం కుట్ర అవుతుందే తప్ప విప్లవకారులుగా తాము మొత్తం ఈ దేశ విశాల పీడిత ప్రజానీకాన్ని చైతన్య పరచి, వాళ్ళ హక్కుల పట్ల, వాళ్ళపై జరుగుతున్న అణచివేత పట్ల స్పృహ కల్గించి, ప్రపంచ పీడిత ప్రజావిముక్తికి కరదీపికగా నిలిచే మార్క్సిజం – లెనినిజం – మావో ఆలోచనా విధానాన్ని వాళ్ళకు అందించి విశాల జనబాహుళ్యాన్ని ఈ దోపిడీ, పీడక, ప్రజాకంటక రాజ్యాన్ని కూలద్రోయడం కుట్ర కానేరదని, ఇది బహిరంగంగా, ప్రజా మద్దతుతో, ప్రజల ప్రత్యక్ష పాత్రతో జరిగే ఒక మహోద్యమానికి మహోన్నత రూపం అని విప్లవకారులు కోర్టులో సింహనాదం చేస్తూ, కుట్రదారులు ప్రభుత్వవర్గాలేనని సవాల్ చేశారు. విశాల భారత ప్రజానీకాన్ని, ప్రజాపోరాటాలను ప్రక్కదారి పట్టించి అతి కొద్దిమందిగా గల ఈ దేశ బడాభూస్వామ్య, దళారీ బూర్జువావర్గాలు బ్రిటీష్ సామ్రాజ్యవాదులతో మిలాఖతై అర్ధరాత్రి చీకటి ఒప్పందానికి పాల్పడటమే చరిత్రలో అతి పెద్ద కుట్ర తప్ప తమది కుట్ర కానేరదని, కోర్టుల్లో కుట్రదారులుగా నిలబడాల్సిన వాళ్ళు, ఈ దేశపు బడా భూస్వామ్య దళారీ బూర్జువావర్గమే తప్ప తాముకాదని ఎలుగెత్తి చాటారు.

మొత్తంగా భారతదేశ నూతన ప్రజాతంత్ర విప్లవ కార్యక్రమాన్ని, వ్యూహాన్ని, ఎత్తుగడలను, విప్లవకాలంలో కలసి వచ్చే మిత్రులెవరు? శత్రువులెవరు? విప్లవాన్ని చివరికంటా నడిపించే చోదకశక్తులెవరు? అని క్షుణ్ణంగా నాగిరెడ్డి, డి.వి.లు విప్లవం యొక్క లక్ష్యాలేమిటో వివరించారు. భారతదేశానికి విప్లవం అనేది ఎందుకు అవసరమో అన్నది కూడా వాళ్ళు తమ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. అధికార మార్పిడి జరిగి 25సం॥లు అయినా ఈ దేశంలో విశాల ప్రజానీకం ఆకలి దప్పులతో అలమటించడానికి కారకులెవ్వరు అన్నది వాళ్ళ సూటిప్రశ్నగా వుంది.

స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పబడిన తర్వాత కూడా ఈ దేశంలో వలస పాలన కాలం నాటి ఆర్థిక విధానాలు ఏ రూపంలో అయినా కొనసాగుతూ ఉండినట్లయితే అది స్వాతంత్ర్యం నీడగా కూడా ఉండబోదని గంభీరమైన ప్రకటనలిచ్చిన 'సోషలిస్టు' నెహ్రూ ఈ పునాదిని కదిపే సాహసాన్ని చేయలేనని తప్పించుకునే మాటల వెనుక వున్న అసలు ఉద్దేశ్యాలు ఏమిటో, ఈ దేశపు జాతీయ విప్లవానికి విద్రోహం చేసిన బడా బూర్జువా, భూస్వామ్యవర్గ రాజకీయ నాయకులు విశాల ప్రజానీకాన్ని అత్యంత ఉద్దేశ్యపూర్వకంగా, ఒక పద్ధతి ప్రకారం కుట్రపన్ని పంటచెరుకుగా వాడుకొంటున్న వైనాన్ని వివరించారు. ఈ దళారీ పాలకవర్గాలను, ఈ పరాన్న భుక్కులను న్యాయస్థానాల్లో చువ్వల బోనెక్కించి నిలబెట్టగలిగే ధైర్యం అత్యున్నత న్యాయవిభాగాలైనా కల్గి వున్నాయని భావించగలమా అని విప్లవకారులు ఈ న్యాయస్థానాల మేలి ముసుగును చీల్చివేశారు.

బాటసారి, పులి, బంగారు కంకణం కథ మాదిరిగా ఈ దేశాన్ని గ్రాముల రూపంలో కొద్దిపాటి డాలర్లను వెదజల్లుతూ, ఈ దేశపు సమస్త పీడిత ప్రజానీకం రక్తాల్లోంచి వెలువడుతున్న సంపదను అపారంగా దోచుకుపోతున్న సకల సామ్రాజ్యవాద దేశాల పాదాలు నాకే ఏజంట్స్‌గా వున్న ఈ దోపిడీ పాలకవర్గ ప్రతినిధులు కుట్రదారులా? లేక సమస్త పీడిత ప్రజానీకం కోసం అపారమైన కష్టాలు అనుభవిస్తూ పీడిత ప్రజానీకంలో నీళ్ళల్లో చేపల వలే కలిసి జీవిస్తున్న మేం కుట్రదారులమా? అన్నది న్యాయస్థానాలే నిర్ణయించాలని ఆ విప్లవకారులు సవాల్ చేసిన తీరు న్యాయమూర్తులను నివ్వెరపరచింది. భారతదేశ సంపదను ఇబ్బడి, ముబ్బడిగా కొల్లకొట్టుకపోవడమేకాక ప్రజానీకంలో ఒక ఉన్నత వర్గాన్ని సృష్టించి వాళ్ళ మెదళ్ళను నియంత్రిస్తూ అంతర్జాతీయంగా విషప్రచారాలకు పాల్పడుతున్న ఈ సామ్రాజ్యవాద భూస్వామ్య వ్యవస్థను ప్రజా విప్లవాలలో తుదముట్టించడం ఒక ప్రధాన కర్తవ్యంగా ఎందుకుండకూడదు అని ఈ న్యాయస్థానాలను విప్లవ కారులు సునిశితంగా ప్రశ్నించారు.

అలీన విధానం మాటల్లో వల్లిస్తూ అగ్రరాజ్యాల కనుసన్నల్లో మెలుగుతున్న ఈ దేశ పాలకవర్గాలు విస్తరణవాద వాంఛలతో పొరుగు దేశాలతో శత్రుత్వం పెంచుకొని, చేతనైతే ఆ దేశాలను విభజిస్తూ ప్రజల్లో జాతీయ ఉన్మాదాన్ని రెచ్చ గొడుతూ, అంతర్జాతీయ శాంతికి భంగం కల్గిస్తూ, సామ్రాజ్యవాదం వదిలిన చెప్పుల్లోకి కాళ్ళుదూర్చి నడుస్తున్న ఈ దేశీయ దోపిడీ పాలక వర్గాలు దేశభక్తులు కాదు. సరిగ్గా ఈ విధానాలను వ్యతిరేకిస్తూ అష్టకష్టాలు పడుతూ అపార త్యాగాలతో, రక్తసిక్త రహదారుల్లో శ్రమైక జీవన సౌందర్యానికి విలువనిచ్చే దేశభక్తులైన ప్రజా విప్లవకారులు కుట్రదారులెలా అవుతారు? ఈ న్యాయస్థానాల్లో విప్లవకారులు ఈ విధంగా ప్రశ్నించిన తీరు ఆనాడు ఈ దేశ జన బాహుళ్యాన్ని ఉర్రూతలూగించింది.

అమెరికన్ సామ్రాజ్యవాదానికి వత్తాసుగా అంతర్జాతీయంగా రష్యా నాయకత్వాన సోషల్ సామ్రాజ్యవాదం అండగా నిలుస్తున్న కాలం అప్పటికే ప్రారంభమైంది. భారతదేశంలో రివిజనిస్టు, నయా రివిజనిస్టు క్యాంపులు అంతర్జాతీయ అండను చూసుకొని తమదే సరైన సిద్ధాంతం అనీ, పాలకవర్గాలు తామూ సోషలిస్టులమే అని చెప్పుకోవడానికి ఈ పార్టీలు వాటితో పొత్తులు పెట్టుకోవడం ద్వారా మద్దతిస్తున్నాయి. చరిత్రలో ప్రజలకు మిత్రులెవరో, ప్రజా వంచకులు, ప్రజాద్రోహులు ఎవ్వరో నిరూపించబడి తీరుతుంది అని విప్లవకారులు ఉద్ఘోషించిన తీరు కోట్లాది పీడిత ప్రజానీకానికి ఆదర్శంగా నిలిచింది.

ఆనాడు ప్రఖ్యాత న్యాయవాది సి.పద్మనాభరెడ్డి ఈ కుట్రకేసుకి డిఫెన్స్ వాదన పెట్టిన న్యాయవాదులలో ఒకరు. ఆయన ఉద్దేశ్యంలోనే "నాగిరెడ్డిని ఎరిగే అదృష్టం నాకు ఆయన కేసును వాదించటం వల్ల కలిగింది. నాగిరెడ్డి కుట్రకేసుగా జగత్ ప్రసిద్ధి పొందిన కేసుకి నేను అడ్వకేట్‌గా ఉన్నాను. ఆ కేసులో ప్రభుత్వం చేసిన ఆరోపణలకు ఆయన ఇచ్చిన జవాబు రాజ్యాన్ని దోషిగా నిలబెట్టింది. సూర్యోదయంతో లోకం రూపుదిద్దు కొన్నట్లుగా ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్ చదివిన తర్వాత ఎవరిలోనైనా నూతన దృక్పథం రూపొందు తుంది. విప్లవకారులకు తక్షణ కార్యక్రమాన్ని నిర్దేశించటం కుట్ర అందీ ప్రభుత్వం. తక్షణ కార్యక్రమం ఆవశ్యకత ఏమిటో జైల్లో ఉండే దేశ రాజకీయ, ఆర్థిక పరిస్థితిని విశ్లేషించి చెప్పారు, టి.ఎన్. మనుష్యులను ఎంతో ప్రేమించే టి.ఎన్.ను తెల్లదొరలు మొదలుకొని తెలుగుదొరల వరకు ఎన్నోసార్లు ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాల క్రింద నిర్బంధించారు. ప్రివెంటివ్ చట్టాలన్నీ మానవాభ్యుదయాన్ని నిరోధించే స్వభావాన్ని కల్గి ఉంటాయని టి.ఎన్. జైలు జీవితమే చెబుతుంది".

సి.పి.యం. రాజకీయాలతో వున్న న్యాయవాది ఎన్.వి. భాస్కరరావు, సి.పి.ఐ.కి చెందిన రావి సుబ్బారావు మొదట్లో ఆదుర్దాతో ఈ కేసుకి హాజరయ్యారు. వారి పార్టీ నిర్ణయం ప్రకారం ఆయన కేసు నుంచి ఒకరు వైదొలగారు. రావి సుబ్బారావు గారు కొనసాగారు. ఈ కేసులో మరొక న్యాయవాదిగా ఎస్.వి.ఎల్. నరశింహం గారు ఉన్నారు. ఆయన మాటల్లో "నాగిరెడ్డి పార్టీపై కుట్రకేసు పెట్టారు. ఈ కేసులో న్యాయవాదిగా ఉంటారా అని మాదాల నారాయణస్వామి ఉత్తరం వ్రాశారు. వెంటనే ఒక పోస్టు కార్డు వ్రాశాను. "It is not a mere privilege for me. It is a pride for me" అని. ఈ సందర్భంగా ఎస్.వి.ఎల్. గారికి టి.ఎన్.తో సన్నిహిత పరిచయం ఏర్పడింది. టి.ఎన్. వ్యక్తిత్వాన్ని దగ్గరగా పరిశీలించే అవకాశం ఆయనకు కల్గింది. ఆయన మాటల్లోనే "కామ్రేడ్స్ అందరికీ సహాయం చేయాలనే ఆరాటం ఆయనది. అందరూ తన గురించి ఏమి ఆలోచిస్తున్నారు అనే అంశంపట్లగానీ, రేపు ఏదైనా విభేదాలు వస్తే తన గురించి ఎలా ప్రచారం చేస్తారో అనే ఆలోచనగాని ఆయనకుండేదికాదు. ఈ వైఖరి చూసి ఆయనకు 'అమాయక చక్రవర్తి' అని పేరు పెట్టాను" అన్నారు.

కుట్ర కేసుకు మేధావులైన న్యాయవాదులని సమీకరించుకోవడం ఒక ఎత్తుకాగా, ప్రభుత్వ వాదనలను తునాతునకలు చేయడానికి మేధోపరంగా అత్యంత ఎక్కువ అధ్యయనం సాగించడానికి వీలుగా పుస్తకాలు, సాహిత్యం అందుబాటులో వుంచుకోవడం, కేసును డిఫెండ్ చేసుకోవడానికి ధనం సమీకరించడం ఒక ఎత్తుగాను ఉండేది.

కుట్రకేసు సందర్భంగా తెల్లవారుఝాము 2, 3 గంటల వరకూ అధ్యయనం చేసేవారు. ఆయన ఏదశలోనూ లాయర్‌ను పెట్టుకోలేదు. తన కేసును తానే డిఫెండ్ చేసుకొనేవాడు. ఉద్యమాల ద్వారా ఈ రాజ్యాంగయంత్రాన్ని కూల ద్రోయటమే తమ అంతిమ లక్ష్యం అని నిష్కర్షగా ప్రకటించడంలో టి.ఎన్. అగ్ర భాగాన నిలబడ్డాడు.

కోర్టుకు మొదటిసారి తీసుకువెళ్ళేటప్పుడు పోలీసులు సంకెళ్ళు వేస్తారని విప్లవకారులకు తెలిసింది. సంకెళ్ళు వేసే దుష్టయత్నాన్ని తిప్పి కొట్టాలని విప్లవకారులు భావించారు. తీవ్రమైన ప్రతిఘటన ఇవ్వడం ద్వారా సంకెళ్ళు వేయడాన్ని నిరోధించాలని నిర్ణయం తీసుకొన్నారు. ముందుగా టి.ఎన్., డి.వి.లకు సంకెళ్ళు వేయడానికి ప్రయత్నించారు. ఆ సందర్భంగా టి.ఎన్., డి.వి.లు తీవ్రంగా ప్రతిఘటించారు. బలవంతంగా వేయడానికి పోలీసులు విఫలయత్నం చేశారు. "నా కోర్టుకు తీసుకు వచ్చేటప్పుడు సంకెళ్ళు వేయకండి" కావాలంటే అదనపు సెక్యూరిటీని పెట్టుకోండి అనే ఉత్తర్వులు జడ్జిగారు ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడింది.

వలస పాలకులు విప్లవకారులపై కుట్రకేసులు బనాయించి, అక్రమకేసుల్లో శిక్షలు విధించి అండమాన్‌లోని సెల్యులర్ జైలు, భారతదేశంలోని ఇతర జైళ్ళలో బంధించేవారు. ఈ జైళ్ళు నరక ప్రాయంగా వుండేవి. వీటిని నరకప్రాయంగా ఉంచడం ద్వారా ఆనాటి జాతీయ విప్లవకారుల మనోధైర్యాన్ని భగ్నం చేయగలమని ఆనాటి బ్రిటీష్ సామ్రాజ్యవాదులు కలలుగన్నారు. విప్లవకారుల పట్ల, ఖైదీల పట్ల మానవతా దృక్పథం ప్రదర్శించాలన్న కోర్కెలతోను బలమైన ఉద్యమాలను జైళ్ళలో ఆనాటి జాతీయ విప్లవకారులు ప్రదర్శించారు. అండమాన్ జైలులో ఖైదీల పరిస్థితి మెరుగుదలకోసం ఆనాటి జాతీయ విప్లవకారులు ఆమరణదీక్షలు చేశారు. జైళ్ళలో సంస్కరణల కోసం సాగిన వీరోచిత పోరులో 63 రోజులు నిరసనదీక్ష చేసిన జతిన్‌దాస్‌పట్ల జైలు అధికారులు అత్యంత ముష్కరంగా ప్రవర్తించిన కారణంగా అమరుడైనాడు. ఆనాటి అమరుల త్యాగాల ఫలితంగా జైళ్ళలో సంస్కరణలు వచ్చాయి. అయితే బ్రిటీష్ సామ్రాజ్యవాదులకన్నా కూడా భీకరంగాను, అత్యంత పాశవిక నిర్బంధ పరిపాలన కొనసాగిస్తున్న "సర్వసత్తాక, స్వతంత్ర, గణతంత్ర" రాజ్యంలో మాత్రం జైళ్ళు యమకూపాలుగానే ఆనాడున్నాయి.

ఈ పరిస్థితులకు వ్యతిరేకంగా, జైలు మాన్యువల్స్ ప్రకారమే జైళ్ళలో ఖైదీలను చూడాలన్న డిమాండ్‌కోసం, జైలు పరిస్థితుల మెరుగుదల కోసం డిమాండ్ చేశారు. అతి పెద్ద ప్రజాస్వామిక రాజ్యం అని, జైళ్ళు సంస్కరణ కేంద్రాలే తప్ప శిక్ష కేంద్రాలు కావని నిరంతరం ఘోషించే ఈ పాలకవర్గాలు కమ్యూనిస్టు విప్లవకారుల న్యాయమైన డిమాండ్ల పట్ల ఎటువంటి సానుకూలతా కనపర్చలేదు.

పార్వతీపురం కుట్రకేసులో నిందితులుగా వున్న విప్లవఖైదీలు విశాఖ సెంట్రల్ జైలులో సదుపాయాల కోసం, రాజకీయ ఖైదీలుగా గుర్తింపు హక్కు కోసం పోరాటం ప్రారంభించారు. నిరాహార దీక్ష చేస్తున్న కా॥ గోవిందరావు తదితరులు ప్రాణాపాయంలో పడ్డారు. వారికి మద్దతుగాను, జైళ్ళలో సాధారణ పరిస్థితుల మెరుగుదల కోసం టి.ఎన్. తదితరులు నిరాహారదీక్షలు ప్రారంభించారు. మొదటి బ్యాచ్‌లో కామ్రేడ్స్ నాగిరెడ్డి, ఎస్.సుబ్బారెడ్డి, ఎమ్.సుబ్బారెడ్డి నిరాహారదీక్షలు ప్రారంభించారు. నాగిరెడ్డి, ఎస్.సుబ్బారెడ్డిలకు లోబి.పి. మూలంగా ఆరోగ్యం క్షీణించింది. ప్రాణాపాయం ఏర్పడిందని వైద్యులు ప్రకటించడంతో, ప్రజాగ్రహం అవధులు దాటే ప్రమాదం ఏర్పడుతుందని గ్రహించిన పాలకులు వావిలాల గోపాలకృష్ణయ్య తదితర ప్రజాస్వామ్యవాదుల జోక్యం వలన జైళ్ళలో సంస్కరణలు చేస్తామని, విశాఖ విప్లవ ఖైదీల డిమాండ్లు నెరవేరుస్తామని హామీ ఇవ్వడంతో కా॥ టి.ఎన్. తదితరులు నిరాహారదీక్షలు విరమించారు.

పాలకుల బాధ్యతారహిత, నిర్లక్ష్యపూరిత, అణచివేత స్వభావంపైన టి.ఎన్. తదితర విప్లవకారులు జైల్లో బందీలుగా ఉంటూనే హక్కులకై పోరాడారు.

కా॥ నాగిరెడ్డి జైలులో వున్నప్పుడే భూపేష్ గుప్తా మరియు ప్రభుత్వ సెక్రటరీగా ఉన్న యుగంధర్‌లు కూడా ఇంటర్వ్యూ చేశారు. మీ పోరాటం దేనికి, పోరాట లక్ష్యాలు, మార్గాలు ఏమిటి అన్న ప్రశ్నకు చాలా దృఢంగానూ, స్పష్టంగానూ టి.ఎన్. తన లక్ష్యాలను వివరించారు. భూస్వాములు, పోలీసులు అత్యాచారాలు చేస్తుంటే ఈ 'ప్రజాస్వామిక' ప్రభుత్వం ఏంచేస్తోంది? ప్రజల హక్కులపై దాడులు చేస్తుంటే ఘోరాతిఘోరంగా వున్న గిరిజన ప్రజల పరిస్థితి తిరుగుబాట్లు చేయించదా? ఇంకా స్పష్టంగా, నిర్దిష్టంగా ఉదాహరణలతో సైతం ఉద్యమాలు ఎందుకు చేస్తున్నామో తెలుసుకోవాలంటే పోరాట ప్రాంతాలలో నేతలైన ఆచారి మొదలైన వారిని ప్రశ్నించి తెలుసుకోండి అని టి.ఎన్. జవాబిచ్చాడు.

విప్లవకారుల మీద కుట్రకేసులు పెట్టడంలో అత్యంత కుట్రదారులుగా వ్యవహరించిన ఈ దోపిడీ రాజ్యాంగ యంత్రాంగం విప్లవకారులను నిజాయితీరహితులుగా చిత్రించడానికి కూడా అనేక కుట్రలు పన్నింది. విప్లవకారులకున్న పేరు, ప్రతిష్టలను భగ్నం చేయడానికి అనేక నిందాపూర్వక ప్రచారాలకు పాల్పడింది. తమపై కుట్రకేసును ఎంతో ధీరత్వంతో ఎదుర్కొని, ఈ రాజ్యమే పెద్ద కుట్రదారని నిరూపించినట్లుగానే అవధులు లేని నిందా ప్రచారాన్ని సైతం కా॥ టి.ఎన్. తదితర విప్లవకారులు ఎదుర్కొన్నారు.

ఈ కుట్రకేసు జరుగుతున్న సందర్భంలో ప్రభుత్వమే ఒక ఇన్‌ల్యాండ్ లెటర్ సృష్టించింది. పెనుగొండకు చెందిన ఒక వ్యక్తికి వ్రాయబడిన ఈ ఉత్తరంలో కా॥ నాగిరెడ్డికి ఈ కోట్ల రూపాయల డబ్బును చేర్చండి అని వుంది. ప్రభుత్వమే సృష్టించిన ఈ లెటర్ ఆధారంగా ప్రభుత్వమే టి.ఎన్. యొక్క నిజాయితీని బద్నాం చేయాలను కొంది. దీనిపై టి.ఎన్., డి.వి.లు తీవ్రంగా స్పందించారు. న్యాయస్థానం ఆవరణలోనే విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ లెటర్ ప్రభుత్వ యంత్రాంగమే సృష్టించిన నీచమైన లెటర్ అని నిరూపించారు. ఎటువంటి విలువలూ లేని ఈ రాజ్యాంగ యంత్రం స్వభావాన్ని ఎక్స్‌పోజ్ చేయడం ద్వారా ఈ ప్రభుత్వాన్ని తలెత్తుకోనీయ కుండా చేశారు.

ఆనాడు హోంమంత్రిగా వున్న జలగం వెంగళరావు ఒక చేత్తో ఈ కుట్రకేసులో విచారణను ఎదుర్కొంటున్న విప్లవకారులను 'రాజ్యాంగ యంత్రాన్ని కుట్రపూరితంగా ధ్వంసం చేసేవాళ్ళు' అంటూ డిసెంబర్ 22, 1969న ఒక ప్రకటనను జారీచేశాడు. అదే వెంగళరావు నాగిరెడ్డి గనుక హింసాయుత విప్లవంలో తనకు నమ్మకంలేదని ప్రకటిస్తే కేసునుంచి విడుదల చేస్తామనే ప్రకటనను చేశాడు. ఒకవైపు న్యాయ స్థానంలో కేసువిచారణ జరగవలసి వుండగా రాజకీయ విశ్వాసాలు వదులుకుంటే కేసులు ఎత్తివేస్తాననడం అంటే కోర్టు ధిక్కారణే కాకుండా కేసును ఎదుర్కొంటున్న కామ్రేడ్స్ ప్రతిష్టకు భంగం కలిగించేవిగానూ ఉన్నాయని కా॥టి.ఎన్. స్పందించాడు. దీనితో జలగం వెంకగళరావును దోషిగా పేర్కొంటూ హైకోర్టులో కేసు ఫైల్ చేశారు. ఖైదీలుగా ఉన్నాం కనుక ప్రభుత్వమే కేసుకయ్యే ఖర్చులు భరించాలని వాదించి టి.ఎన్. విజయం సాధించాడు. ఈవిధంగా జలగం వెంగళరావు కుట్రపూరిత ప్రకటనలను టి.ఎన్. హైకోర్టులో, సుప్రీంకోర్టులోను సవాల్‌చేసి భారతదేశంలో సాయుధ విప్లవ పంథా ఒక అనివార్యమైన సత్యం అని, కా॥ నాగిరెడ్డి ఆ పంథా నుంచి వైదొలగే ప్రసక్తిలేదని టి.ఎన్. నిర్ద్వంద్వంగా నిరూపించాడు.

పై రెండు ఉదాహరణల ద్వారా కా॥ నాగిరెడ్డి విప్లవకారులపై జరుగుతున్న విష ప్రచారాలకు దీటైన జవాబునివ్వడం ద్వారా విప్లవకారుల ప్రతిష్టను మేరు పర్వతంపై నిలబెట్టాడు. మరోవైపు మొత్తంగా ఈ కుట్రకేసులు ఎంత కుట్రపూరిత మైనవో నిరూపించాడు. బ్రిటీష్ వలస సామ్రాజ్య వాదంకంటే ఈ సర్వసత్తాక గణతంత్ర రాజ్యం ఏవిధంగానూ భిన్నం కాదని నిరూపించాడు. న్యాయస్థానాల గోడలు పగిలేలా రణనినాదాలు చేసి ఈ దేశంలో విప్లవం ఎంత ఆవశ్యకమో వివరించాడు. తనపై ఆరోపణలకు తాను కోర్టులో సమర్ధమైన జవాబు లివ్వడం ద్వారా భారత విప్లవకారులకు మేథోపరమైన ఆయుధంగా మార్క్సిజం ఎలా నిలబడిందో వివరించాడు. రాజ్యాంగ యంత్రం ఒట్టి కాగితం పులి మాత్రమే అని, ఈ రాజ్యాంగ యంత్రాన్ని బలమైన సాయుధ పోరాట ప్రజాపంథా ద్వారా కూలద్రోయటం ఎంత చారిత్రక సత్యమో నిరూపించాడు.

టి.ఎన్. తనపైన, తన నిర్మాణంలో వున్న వారిపైన కుట్రకేసులను చాలా సమర్ధంగా ఎదుర్కొన్నాడు. తనకున్న సర్వకీర్తి, ప్రతిష్టలను, వ్యక్తిగత పరిచయాలను సైతం ఉపయోగించుకొని డిఫెన్స్ నిధిని, ఒక లాయర్ల ప్యానల్‌ను తయారు చేసుకొన్నాడు. స్వయంగా తను, డి.వి.లు తమ వాదనాపటిమతో కోర్టులో ప్రాసిక్యూషన్‌ను ముప్పతిప్పలు పెట్టారు. దీనికోసం 60 వేల రూపాయలు ఖర్చు అయి పార్టీ తీవ్రంగా అప్పుల ఊబిలో కూరుకుపోయింది. అదే సమయంలో మహత్తర శ్రీకాకుళ రైతాంగ పోరాటంలో పాల్గొన్న విప్లవకారులపై పార్వతీపురం కుట్రకేసు బనాయించబడింది. ఈ కేసులో సైతం నాగిరెడ్డి అపూర్వమైన కృషిని చేశాడు.

మహత్తర శ్రీకాకుళ గిరిజనోద్యమంపై రాజ్యం తీవ్రమైన అణచివేతను ప్రయోగించింది. వందలాది యువకిశోరాలను రాజ్యం హత్య చేసింది. ప్రజా కవులను, ఉపాధ్యాయులను, విద్యార్థులను, రైతాంగ, గిరిజన పేదలను ఈ రాజ్యం ఎటువంటి సంకోచాలు లేకుండా హత్య గావించింది. దీనికితోడు శ్రీకాకుళ ఉద్యమాన్ని అతివాదపు చెద తినివేసింది. అతివాద ఒంటెత్తు పోకడల్లో కూరుకు పోయిన శ్రీకాకుళ ఉద్యమాన్ని కా॥ నాగిరెడ్డి తన శక్తిమేరకు ప్రజాపంథాలోకి మళ్ళించడానికి చేసిన ప్రయత్నాలు చారుమజుందార్ గ్రూప్ చేసిన విషప్రచారంలో కొట్టుకుపోయాయి. ఓవైపు అతివాద ఒంటెత్తుపోకడలు, మరోవైపు రాజ్యం చేసిన నిర్బంధంతో శ్రీకాకుళ గిరిజనోద్యమం తాత్కాలికంగా వెనుకపట్టు పట్టింది. వందలాది యువకిశోరాలు రాలిపోయిన కాలంలోనే ఈ జిల్లాలో సామాన్య ప్రజానీకం సైతం తీవ్రమైన చిత్రహింసలకు గురైనారు. వందలాది గిరిజన గూడేలు పోలీసుల విచ్చలవిడి దహనకాండలో మాడిమసైపోయాయి. వందలాది గిరిజన స్త్రీలు అత్యాచారాలకు గురి అయినారు. శ్రీకాకుళం ఏజన్సీ మండుతున్న అగ్నిగోళమై పోయింది. అంతవరకూ ఆ ఉద్యమాన్ని నడిపిన నిర్మాణం అంతా కకావికలు కావడంతో ఆ ఉద్యమంలో పాల్గొన్న ప్రజానీకం నివురుగప్పిన నిప్పులాను, గాయాలతో కొట్టుమిట్టాడుతున్న పక్షుల ఆర్తనాదంలానూ ఉంది.

మేరు పర్వతంలాంటి టి.ఎన్. గాయపడ్డ శ్రీకాకుళాన్ని అక్కున చేర్చుకున్నాడు. భయ విహ్వలులైపోయిన గిరిజనుల ఆర్తనాదాలను, కన్నీళ్ళను తుడిచాడు. అక్రమ కేసుల్లో ఇరికించబడ్డ గిరిజన బిడ్డలను బందిఖానాల నుంచి విముక్తి చేయ సంకల్పించాడు. వందలాది గిరిజనులపైన, గిరిజనోద్యమ అగ్ర నాయకత్వంపైన పార్వతీపురం కుట్రకేసుగా పెట్టారు. ఆ కేసులోని కామ్రేడ్స్‌కి డిఫెన్స్ పెట్టాలని నిశ్చయించుకొన్నాడు. కోర్టు పట్ల నమ్మకంలేదని, బూర్జువా, భూస్వామ్య న్యాయ స్థానాల్లో న్యాయం జరిగే ప్రసక్తిలేదని, డిఫెన్స్‌కి అంగీకరించేదిలేదని కొందరు నాయకులు మొండివాదనలు చేశారు. అయినా నాగిరెడ్డి వెనుకడుగు వేయలేదు. తన అపారమైన సహనాన్ని, ప్రజల పట్ల చిత్తశుద్ధిని, బాధ్యతను వదిలివేసి వెనక్కు మరిలేది లేదని నిశ్చయించుకొన్నాడు.

కా॥ నాగిరెడ్డి లెనిన్ రచనలను ఉటంకిస్తూ విప్లవకారులపై పెట్టిన కుట్రకేసులను డిఫెండ్ చేసుకోవడాన్ని సోదాహరణలతో వివరించాడు. జర్మన్ ఫాసిస్ట్ కోర్టులో డిమిట్రోవ్ చేసిన సింహ నాదాన్ని గుర్తుచేశాడు. జాతీయ విప్లవంలో భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులపై పెట్టిన కుట్రకేసులకి వ్యతిరేకంగా ఆనాటి పార్టీ తీసుకున్న వైఖరులను విశదీకరించాడు. పార్వతీపురం కుట్రకేసుకు డిఫెన్స్ పెట్టడం, సహాయం చేయడం కోసం యుద్ధ ప్రాతిపదికన టి.ఎన్. కదిలాడు.

ప్రజల్లో మనోధైర్యాన్ని పెంచాడు. రాష్ట్ర వ్యాప్తంగా శ్రీకాకుళానికి జరిగిన అన్యాయాన్ని, రాజ్యం చేసిన క్రూరమైన హత్యాకాండను వివరించాడు. తీవ్రమైన నిర్బంధం తర్వాత సంస్కరణల గారడీతో ముందుకొచ్చిన ఈ పాలకుల రాజకీయాలను తీవ్రంగా నిరసించాడు. ప్రజల్లో వర్గకసిని పెంపొందించి తిరిగి ఉద్యమాలకు కదలడమే ఈ 'రాజ్యం'కి మనం కట్టే గోరీ అని వివరించాడు. దీనితో శ్రీకాకుళ గిరిజనులు ఆత్మ స్థైర్యం పొందారు.

ఈ విధంగా టి.ఎన్. తన నిర్మాణంపైనగానీ, ఇతర విప్లవ నిర్మాణాలపైనగానీ రాజ్యం పెట్టిన కుట్రకేసులను ఎదుర్కొన్నాడు. ఈ రాజ్యమే ఒక పెద్ద కుట్రదారు అని నిరూపించారు. ఈ రాజ్యం బడా భూస్వామ్య, దళారీ బూర్జువాల తొత్తు అని నిరూపించాడు. దీనికోసం తన శక్తినంతా ధారపోశాడు. విశాల ప్రజానీకాన్ని ఉద్యమాల బాటల్లో ఉరకలెత్తించాడు. చైతన్యం ద్వారా సాయుధ పోరాట పంథాలో ఈ దోపిడీ రాజ్యపు కోటలు బీటలు వారడం ఖాయం అని, కోట్లాది పీడిత ప్రజానీకపు ఆశల జెండా అయిన ఎర్రజెండా రెపరెపలాడటం ఖాయం అని ఆయన చేసిన సింహనాదం భారత న్యాయస్థానాల్లో గింగురు మంటోంది.

ooooo